# DD9 వార్త

తెలుగు దినపత్రిక

బుధవారం, అక్టోబర్ 01, 2025


## అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ్ వాటిక' ఏర్పాటుపై కలెక్టర్ ఆదేశాలు
- తల్లిశిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన

4 లో





పాఠకులు, ప్రకటన కర్తలు, ఏజెంట్లకు

**విజయదశమి శుభాకాంక్షలు**

పండుగ సందర్భంగా గురువారం మా కార్యాలయానికి సెలవు శుక్రవారం సంచిక వెలువడదు.. పునర్దర్శనం శనివారం.




## అమ్మాయితో ఆట సజ్జనార్ తూటా వేట

- ఆడపిల్ల జోలికొస్తే తాట ఊడినట్లే
- ఆకతాయిలకు మూడినట్లే
- హైదరాబాదులో ఎన్కౌంటర్ స్పెషలిస్ట్

### తస్మాత్ జాగ్రత్త

ఆకతాయిలు తస్మాత్ జాగ్రత్త.. ఆడపిల్లల జోలికి వెళ్లే ముందు వారిని వేధించే ప్రయత్నాలు చేసే ముందు మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడే వాళ్ళు ఒళ్ళు దగ్గర పెట్టుకొని ఉండాల్సిన పరిస్థితులు వచ్చేసాయి. తెలంగాణ పోలీస్ శాఖలో కఠినతరమైన నిర్ణయాలను తీసుకునే విషయంలో వెనకాడని పోలీస్ సింగం హైదరాబాద్ వచ్చేసింది. ముఖ్యంగా అమ్మాయిల విషయంలో అడ్డగోలుగా వ్యవహరించిన మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అఘాయిత్యాలకు పాల్పడినా వారి తాట తీసేందుకు ఏమాత్రం వెనకాడని పోలీస్ ప్రస్తుతం మహానగరంలోనే ఉన్నాడు. శాంతి భద్రతల విషయంలో రాజీలేని పనితీరును కనపరిచే పవర్ ఫుల్ పోలీస్ అధికారిగా పేరొందిన ఆయన ప్రస్తుతం సిటీ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టడంతో ఆకతాయిలకు రౌడీలకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పదవీ బాధ్యతలు చేపట్టగానే తన మార్క్ హెచ్చరికలను జారీచేసిన ఆయన అక్రమాలపై ఉక్కు పాదం మోపేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నారు. సామాన్యులకు భరోసాల మహిళలకు ఆసరాగా నిలిచే పోలీస్ అధికారి ప్రస్తుతం హైదరాబాద్ లోని అసాంఘిక శక్తుల ఆటలు కట్టించే దిశగా కార్యాచరణకు శ్రీకారం చుట్టేశారు.

-డిడి9 వార్త, క్రైమ్ బ్యూరో

2 లో



5 లో

## ఆదివాసీల హక్కులు కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలి

- వలస ఆదివాసీల సాగు భూముల జోలికి రావొద్దు
- సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- బీజాపూర్ అటవీ ప్రాంతంలో భారీ డంప్ స్వాధీనం
- పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి గుర్తింపు

3 లో



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు మరో పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. పామెడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన కూంబింగ్‌లో మావోయిస్టులు దాచిన భారీ డంప్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నాయి. డంప్‌లో భారీగా పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి లభ్యమైనట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి.

బీజాపూర్ (ఛత్తీస్‌గఢ్), (డిడి9 వార్త)



## అమ్మాయితో ఆట

# సజ్జనార్ తూటా వేట

## తస్మాత్ జాగ్రత్త

- ఆడపిల్ల జోలికొస్తే తాట ఊడినట్లే
- ఆకతాయిలకు మూడినట్లే
- హైదరాబాదులో ఎన్కౌంటర్ స్పెషలిస్ట్






### సవాళ్ల నడుమ హైదరాబాద్ సిపిగా

ఎన్కౌంటర్ స్పెషలిస్ట్ గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సజ్జనార్ హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఆయన ముందు పెను సవాళ్లు దర్శనమిస్తున్నాయి. నగరంలో రౌడీయిజం హత్యలు విచ్చల విడిగా డ్రగ్స్ విక్రయాలు బెట్టింగ్ దందాలు వంటి అనేక అనైతిక సంఘటనలు ఆయన ముందున్నాయి. సజ్జనార్ రాకతో వాటన్నిటికీ చెక్కు పడే అవకాశాలు ఉన్నాయని నమ్మకం నగర ప్రజల్లో నెలకొన్న నేపథ్యంలో ఆయన పనితీరుకు ఇవన్నీ పరీక్షల్లా మారనున్నాయి. ముఖ్యంగా నగరంలో ఎక్కడపడితే అక్కడ రాజ్యమేలుతున్న డ్రగ్స్ మాఫియాను కూకటివేళ్లతో పెగిలించే దిశగా ఆయన చర్యలు తీసుకుంటే హైదరాబాదులో ఎన్నో అసాంఘిక కార్యకలాపాలను నియంత్రించే అవకాశాలు ఉన్నాయి. డ్రగ్స్ బెట్టింగ్ మాఫియా వలలో చిక్కుకున్న యువత రౌడీయిజానికి అడ్డదారి సంపాదనకు అలవాటు పడి అనేక అసాంఘిక కార్యకలాపాల వైపు మొగ్గు చూపుతున్నారు. డ్రగ్స్ మత్తులో మహిళల పట్ల అఘాయిత్యాలకు పాల్పడడం హత్యలు చేయడం చేస్తుండగా బెట్టింగ్ మాఫియా ఉచ్చులో పడి ఈజీ మనీ కోసం రకరకాల అడ్డదారులు తొక్కుతూ నాశనం అవుతున్నారు. నగరంలో నెలకొన్న డ్రగ్స్ మాఫియాను బెట్టింగ్ దందాలను అడ్డుకునే విషయంలో సజ్జనార్ తీసుకోబోయే చర్యలపైనే హైదరాబాద్ భవిష్యత్ ఆధారపడి ఉందనేది వాస్తవం.

**డి డి 9 వార్త క్రైమ్ బ్యూరో:**

కరుడుగట్టిన నేరస్థులనా, కాకలుతీరిన రౌడీలైనా ఆయన ముందు తోకజాడిస్తే అంతే సంగతులు.. శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వారిపట్ల అత్యంత కఠినంగా వివాదాస్పదమైన చర్యలు తీసుకోవడంలో ఏమాత్రం వెనకాడని ఆయన ప్రజల విశ్వసనీయతను మాత్రం చూరగొన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల అమానుషంగా వ్యవహరించే వారిని చీల్చిచండాడే విషయంలో ఆయన మించిన వారే ఉండరు. ఆయనే తెలంగాణ ఎన్కౌంటర్ స్పెషలిస్ట్ సజ్జనార్.. తెలుగు ప్రజలకు అత్యంత సుపరిచితమైన వ్యక్తి.. పోలీసింగ్ లో విప్లవాత్మకమైన మార్పులు చర్యలు తీసుకోవడంలో ఆరితేరిన సజ్జనార్ సంచలనాలకు కేంద్రబిందువుగా ఉంటారు. క్షమించరాని నేరాలకు పాల్పడిన నేరస్తుల విషయంలో జనాభిప్రాయం మానవీయ కోణాలకు ప్రాధాన్యతనిస్తూ తక్షణ న్యాయం చేసే దిశగా ఆయన తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలు ఆయన్ని ప్రజల గుండెల్లో హీరోగా నిలబెట్టాయి. తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మహిళల పట్ల అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను ఎన్కౌంటర్ చేసిన సజ్జనార్ చర్యలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 2019 డిసెంబర్లో షాద్నగర్ వద్ద మహిళా వెటర్నటీ డాక్టర్ దారుణ హత్య విషయంలో సజ్జనార్ తీసుకున్న తక్షణ న్యాయ నిర్ణయం అప్పట్లో సంచలనం కలిగించింది. హత్యకు పాల్పడి నిందితులను ఎన్కౌంటర్ చేయడంతో దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆ ఘటన సజ్జనార్ ను మాత్రం ప్రజల గుండెల్లో నిలిచిపోయేలా చేసింది. అప్పట్లో ఆయన తీసుకున్న ఈ నిర్ణయం పై రకరకాల విమర్శలు వివాదాలు తలెత్తిన ప్రజల నుండి వచ్చిన సానుకూలత ఆయన ఇమేజ్ ను విశ్వానికి తెలిసేలా చేసింది. నేరస్తుల విషయంలో కరుడుగట్టిన పోలీసింగ్ నిర్వహించడంలో సిద్ధహస్తుడైన ఆయన మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలోనూ రౌడీయిజాన్ని తొక్కి పడేయడంలోనూ తనదైన స్టైల్ లో ముందుకు వెళ్లేవారు.



### మందు తాగి డ్రైవ్ చేస్తే మటాష్

హైదరాబాద్ నగరంలో ఇకపై మద్యం సేవించి వాహనాలు నడిపేవారు జాగ్రత్తగా ఉండాల్సిందే . సిటీ పోలీస్ కమిషనర్ గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సజ్జనార్ మహిళలను వేధించే వారి పట్ల చర్యలు కఠినంగా ఉంటే హెచ్చరిస్తూ అదే సమయంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని టెర్రరిస్టులుగా అభివర్ణించడం చర్చినియాంశంగా మారింది. అంటే భవిష్యత్తులో హైదరాబాద్ సిటీలో మద్యం మత్తులో వాహన నడిపే వారికి చుక్కలు చూపించే పనిలో సజ్జనార్ కార్యాచరణ ఉంటుందనేది స్పష్టమవుతుంది. మత్తులో జరిగే అనేక అనైతిక కార్యకలాపాలను నియంత్రించే దిశగా ఆయన అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ సిటీలో ఎక్కడపడితే అక్కడ యువత మద్యం మత్తులో తూగుతూ అతివేగంగా డ్రైవింగ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తుంటారు ఈ నేపథ్యంలో సిటీ పోలీస్ కమిషనర్ చేసిన హెచ్చరికలు మద్యం బాబులకు తాట తీసే చర్యల్లో భాగమేనని స్పష్టమవుతుంది. ఏది ఏమైనా నగర పోలీస్ కమిషనర్ గా సజ్జనార్ బాధ్యతలు తీసుకోగానే అనేక వర్గాల ప్రజలు ఆయన పని తీరుపై అంచనాలు వేస్తూ పోతున్నారు. సజ్జనార్ రాకతోనైనా మహానగరంలో డ్రగ్స్ నియంత్రణ బెట్టింగ్ దందాలు మద్యం మాఫీ ఆగడాలు ఆడపిల్లలపై అఘాయిత్యాలు సైబర్ నేరాలు రౌడీయిజం నియంత్రించబడతాయనే ఆశాభావాన్ని సిటీ ప్రజల వ్యక్తపరుస్తున్నారు.










# అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

**మంగపేట, డీడీ 9వార్త**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి సీతక్కకు 2152 అతిథి అధ్యాపకుల సంఘం ములుగు జిల్లా నాయకుడు కురిమిళ్ళ శ్యామ్ వినతి పత్రాన్ని అందించారు. బుధవారం మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలానికి వచ్చిన సీతక్కను కలుసుకుని కాంట్రాక్ట్ అధ్యాపకుల బదిలీలు మరియు ఇటీవల జరిగిన రెగ్యులర్ అధ్యాపకుల నియామకం వల్ల డిస్టర్బ్ అయిన అతిథి అధ్యాపకులను విధుల్లోకి తీసుకోవాలని కోరడంతో పాటు పెండింగ్ లో ఉన్న వేతనాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలు విన్న సీతక్క సానుకూలంగా స్పందించారు. అతిథి అధ్యాపకుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడంతో పాటు సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య తీవ్రతను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని సీతక్క హామీ ఇచ్చారు.

# గిరిజనులకు, ఐటీడీఏ సిబ్బందికి దసరా శుభాకాంక్షలు తెలిపిన ఐటీడీఏ పీఓ బి. రాహుల్

**భద్రాచలం, అక్టోబర్ 01 (డిడి9):**




హిందువుల ముఖ్యమైన పండుగైన దసరా (విజయదశమి) సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు, గిరిజన విద్యార్థినీ విద్యార్థులకు, సేవలందిస్తున్న ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, ఐటీడీఏ కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు, సిబ్బందికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీఓ) బి. రాహుల్ బుధవారం నాడు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే దేవీ నవరాత్రులు, పదవ రోజు విజయదశమి పండుగ ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా వివరించారు. హిందూ సాంప్రదాయం ప్రకారం, ఈ తొమ్మిది రోజులపాటు దుర్గాదేవిని వివిధ శక్తి రూపాలతో అలంకరించి పూజలు చేస్తారని, పదవ రోజు కుటుంబం అంతా కలిసి ఆనందంగా దసరా జరుపుకుంటారని తెలిపారు. దసరా పండుగ వెనుక ఉన్న చరిత్రను పీఓ రాహుల్ ప్రస్తావించారు. జగన్మాత దుర్గాదేవి మహిషాసురుడు అనే రాక్షసునితో తొమ్మిది రాత్రులు యుద్ధం చేసి విజయాన్ని సాధించిన సందర్భంగా పదో రోజు ఈ పండుగను జరుపుకుంటారని అన్నారు. అలాగే, తెలంగాణ పల్లెల్లోని పెద్దలు చెప్పిన చరిత్ర ప్రకారం, శ్రీరాముడు రావణునిపై గెలిచిన సందర్భమే కాక, పాండవులు వనవాసం వెళ్తూ జమ్మి చెట్టుపై దాచిన తమ ఆయుధాలను తిరిగి తీసుకున్న రోజు కూడా ఇదే అని, ఈ సందర్భంగా రావణ వధ, జమ్మి ఆకుల పూజ చేయడం రివాజు అని ఆయన గుర్తు చేశారు. మారుమూల గిరిజన ప్రాంతాలలో ఉండే కుటుంబాలు ఘనంగా, సంతోషంగా పండుగ జరుపుకోవాలని, గిరిజనులందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుతూ మరోసారి దసరా పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఆది కర్మయోగి అభియాన్' పనులను పగడ్బందీగా అమలు చేయాలి

- **గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని అధికారులకు కేంద్రం ఆదేశం.**

**భద్రాచలం, అక్టోబర్ 01 (డిడి9 వార్త):**




మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన గ్రామాలలో 'ఆది కర్మయోగి అభియాన్' పథకం కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సంబంధిత నోడల్ అధికారులు (డిఎమ్‌టిలు, బిఎమ్‌టిలు) పగడ్బందీగా నిర్వహించి, ఆయా గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని న్యూఢిల్లీలోని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెక్రటరీ విబు నాయర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

బుధవారం నాడు న్యూఢిల్లీలోని మినిస్టర్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో/టెలి కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రాల వారీగా ఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో ఆదిసేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రతి గ్రామంలో సాతి సహాయోగులను నియమించిన ప్రతి అంశాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సూచించారు.

గ్రామంలోని సామూహిక సమస్యలతో పాటు, ఇంటింటికి తిరిగి ఆ కుటుంబాల యొక్క సమస్యలను కూడా తెలుసుకొని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామానికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ (కార్యాచరణ ప్రణాళిక) సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

కేంద్ర సెక్రటరీ సూచనలకు ప్రతిస్పందిస్తూ, ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్ వివరాలు అందించారు. ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ పరిధిలోని 19 మండలాలలోని 130 గ్రామపంచాయతీలలో గ్రామ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి పోర్టల్‌లో పొందుపరచడానికి, విలేజ్ నోడల్ ఆఫీసర్లు, బిఎమ్‌టిలు, సాతి సహాయోగులను నియమించడం జరిగిందని ఆయన వివరించారు. ఈ సిబ్బంది ద్వారా 130 పంచాయతీలలో ఆదిసేవా కేంద్రాలను ప్రారంభించామని, ఇంటింటికి తిరిగి సమాచారం సేకరించడం జరిగిందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, సిబ్బంది కార్తీక్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.






# ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

- **బీజాపూర్ అటవీ ప్రాంతంలో భారీ డంప్ స్వాధీనం**
- **పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి గుర్తింపు**

**బీజాపూర్ (ఛత్తీస్‌గఢ్), అక్టోబర్ 01 (డిడి9 వార్త):**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులకు మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. పామెడు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు నిర్వహించిన కూంబింగ్‌లో మావోయిస్టులు దాచిన భారీ డంప్‌ను గుర్తించి, స్వాధీనం చేసుకున్నాయి. డంప్‌లో భారీగా పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రి లభ్యమైనట్లు భద్రతా బలగాలు వెల్లడించాయి. ఇటీవల వరుస లొంగుబాట్లు, భారీ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో భద్రతా బలగాలు అటవీ ప్రాంతంలో విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే, పామెడు పోలీస్ పరిధిలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అత్యంత పకడ్బందీగా, ఒక పెద్ద సొరంగంలో ఈ మందుగుండు సామాగ్రిని దాచినట్లు గుర్తించారు. సొరంగంలోకి వెళ్లిన భద్రతా బలగాలు డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి.

**భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు వ్యూహం:**

భద్రతా బలగాలు కూంబింగ్‌కు వచ్చిన సమయంలో వారిని మట్టుబెట్టాలనే లక్ష్యంతో మావోయిస్టులు ఈ అటవీ ప్రాంతంలో ఒక పక్కా ప్రణాళికతో వ్యూహం రచించినట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ల తర్వాత తమ స్థావరాన్ని మార్చుకున్న మావోయిస్టులు, సొరంగం గుండా భద్రతా బలగాలు అటువైపు వస్తే భారీ పేలుడు పదార్థాలు ఉపయోగించి వారిని మట్టుకట్టాలని ఉద్దేశించినట్లు భద్రతా బలగాలు అంచనా వేశాయి. మావోయిస్టుల ఈ వ్యూహాన్ని ముందస్తుగానే పసిగట్టిన భద్రతా బలగాలు, వారు ఏర్పాటుచేసిన డంప్‌ను గుర్తించి నిర్వీర్యం చేశాయి. ఈ డంప్‌లో కొన్ని ఆయుధాలతో పాటు భారీగా పేలుడు పదార్థాలు, మందుగుండు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల వ్యూహాన్ని ముందుగానే పసిగట్టి, డంప్‌ను నిర్వీర్యం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని భద్రతా బలగాలు పేర్కొన్నాయి. ఆ అటవీ ప్రాంతంలో ఇంకా విస్తృతంగా కూంబింగ్ కొనసాగుతోంది.







# జిల్లా ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్

- **విజయదశమి ధర్మం, న్యాయానికి ప్రతీక: కలెక్టర్**

**కొత్తగూడెం, అక్టోబర్ 01 (డిడి9):** కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ విజయదశమి (దసరా) పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలందరికీ తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ, విజయదశమి పండుగ అనేది ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పర్వదినమని తెలిపారు. ఈ పండుగ చెడుపై ధర్మం గెలిచిన శుభసూచకమని పేర్కొన్నారు.

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు దుర్గాదేవి తొమ్మిది రూపాలను ఆరాధించడం విశేషమని ఆయన అన్నారు. విజయదశమి పర్వదినం సమాజంలో ధర్మం, న్యాయం మరియు సత్యానికి ప్రతీకగా నిలుస్తుందని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

- **అంగన్వాడీ కేంద్రంలో 'పోషణ్ వాటిక' ఏర్పాటుపై కలెక్టర్ ఆదేశాలు**
- **తల్లి-శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**

**కొత్తగూడెం, అక్టోబర్ 01 (డిడి9):**

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం నాడు పాల్వంచ మండలం, తోగూడెం-2 అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రం యొక్క కార్యకలాపాలను కలెక్టర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యంగా, అంగన్వాడి కేంద్రంలో పోషణ్ వాటిక (Nutrition Garden) ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకతపై ఆయన చర్చించారు. ప్రతి అంగన్వాడి కేంద్రంలోనూ పోషకాహారానికి తోడ్పడే కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలు నాటాలని, వాటిని సమర్థవంతంగా సంరక్షించడం ద్వారా చిన్నారులు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారం అందేలా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

**బాలామృతం వినియోగంపై ఆరా:**

ఈ సందర్భంగా కలెక్టర్ తల్లి-శిశు ఆరోగ్యంపై ప్రత్యేకంగా చర్చించారు. ముఖ్యంగా, ఇంటికి తీసుకెళ్లే పౌష్టికాహారం (టేక్ హోమ్ రేషన్) పంపిణీ విధానంపై సమీక్ష జరిపి, తల్లుల నుండి నేరుగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. "బాలామృతం" వినియోగం ఎలా జరుగుతోంది? పిల్లలు తీసుకుంటున్నారా? ఏమైనా సమస్యలు ఉన్నాయా? అన్న అంశాలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. తల్లుల సమాధానాలను శ్రద్ధగా విని, అవసరమైన చోట తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**స్వయం పూర్ణత సాధించడమే లక్ష్యం:**

"పోషకాహార లోపం రాకుండా అంగన్వాడి కేంద్రాలు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయి. ప్రతి కేంద్రం సమయానికి పౌష్టికాహారం అందించడంతో పాటు, చిన్నారులు ఆహారం తీసుకునేలా పర్యవేక్షించాలి. పోషణ్ వాటికల ద్వారా స్వయం పూర్ణత సాధించడమే లక్ష్యం కావాలి" అని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ, ఎంపీడీఓ, సూపర్వైజర్ అశోక, ఏపీఓ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చెడు పై మంచి గెలవడమే విజయదశమి పండుగ

- **సీఐ ముత్యం రమేష్**

**వెంకటాపురం, అక్టోబర్ 01 (డిడి9 వార్త ):**

చెడు పై మంచి గెలవడమే విజయదశమి పండుగ ప్రత్యేకత అని వెంకటాపురం సీఐ ముత్యం రమేష్ తెలిపారు ఈ సందర్భంగా DD9 వార్త తో మాట్లాడుతూ మొదటగా వెంకటాపురం ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు

విజయదశమి పండగ అంటే ధర్మం అధర్మం మధ్య జరిగే పోరాటంలో మంచికి లభించిన విజయము,రాముడు రావణుడిపై సాధించిన జయం, దుర్గాదేవి మహిషాసురునిపై చూపిన పరాక్రమం... ఇవన్నీ చెడును ఓడించి మంచిని కాపాడిన సందర్భాలు అన్నారు ఈ మంచి చెడు పోరాటం పండుగ కథల్లో మాత్రమే కాదు, మన నిజజీవితంలో సమాజంలోనూ ప్రతిరోజూ కనిపిస్తుంది పోలీసులు సమాజంలో రాముడు దుర్గమ్మ లాంటి ధర్మబలగాలుగా నిలుస్తారు. వారు చట్టాన్ని, నీతిని రక్షిస్తూ ప్రజల కోసం చెడుతో యుద్ధం చేస్తారు.క్రిమినల్స్ చెడు మార్గాన్ని ఎంచుకున్న రావణుడు మహిషాసురుడు ల వంటివారు. వారు స్వార్థం, దురాశలతో సమాజంలో అన్యాయం చేస్తారు. ఈ రోజున మహిషాసురుడిపై దుర్గామాత విజయం సాధించి లోకాన్ని రక్షించినట్లు పురాణాలు చెబుతాయి. ఆ తొమ్మిది రాత్రుల పూజలే నవరాత్రులు. ఇక పదవ రోజు ఆ విజయాన్ని సూచించేదే విజయదశమి. రావణుడిపై శ్రీరాముడు విజయం సాధించిన రోజు కూడా ఇదే. ఈ విజయానికి గుర్తుగా రావణ దహనం చేస్తారు.

అందుకే ఈ పండుగను విజయదశమి అని పిలుస్తారు. ఈ శుభదినాన కొత్త పనులు ప్రారంభించడం, ప్రయాణాలు చేయడం, ఆయుధ పూజలు చేయడం లాంటివి చేయడం ఈ పండగ ప్రత్యేకత అన్నారు . ఎస్సై కొప్పుల తిరుపతి రావు మాట్లాడుతూ పండగల యొక్క ప్రాముఖ్యత గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని తెలియజేయాలని ఈ సందర్భంగా అన్నారు అలాగే పండుగ ప్రజలందరి జీవితాల్లో సకల విజయాలను, ఆనందాన్ని తీసుకురావాలని కోరారు...





# షెడ్యూల్ ఏరియాలో లంబాడాలకు ఇందిరమ్మ ఇళ్లు ఎలా ఇస్తారు?

- **రాజ్యాంగ వ్యతిరేక కేటాయింపులు ఆపాలి**
- **ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షుడు కుంజ మహేష్ డిమాండ్**

**వెంకటాపురం, నూగురు అక్టోబర్ 01 (డిడి 9 వార్త)**



లంబాడీలు ఎస్టీలు కాదని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో ఆదివాసీలు రోడ్డుపై పోరాటాలు చేస్తుండగా, వలస వచ్చిన లంబాడీలకు షెడ్యూల్ ఏరియాలో ఇందిరమ్మ ఇళ్లు ఎలా కేటాయిస్తారని ఆదివాసీ నవనిర్మాణ సేన ములుగు జిల్లా అధ్యక్షులు కుంజ మహేష్ మండల పరిషత్ అధికారిని ప్రశ్నించారు.

బుధవారం నాడు వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో కంతి శంకర్ అధ్యక్షతన జరిగిన ఆదివాసీ నవనిర్మాణ సేన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుంజ మహేష్ మాట్లాడుతూ, షెడ్యూల్ ఏరియాలో రాజ్యాంగ వ్యతిరేఖంగా వలస గిరిజనేతరులకు, లంబాడీలకు పెద్దమొత్తంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం సరికాదని అన్నారు. అర్హత ఉన్న ఆదివాసీలకు మాత్రం ఇళ్లు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు.

**మనోభావాలు దెబ్బతీయడం తగదు**

వెంకటాపురం మండలంలో లంబాడీలకు ఇళ్లు కేటాయించడం ద్వారా ఇక్కడున్న ఆదివాసీల మనోభావాలు, ప్రయోజనాలు దెబ్బతినేలా, హక్కులకు భంగం వాటిల్లేలా మండల పరిషత్ అధికారి వ్యవహరిస్తున్నారని ఆయన మండిపడ్డారు. లంబాడీలు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 సవరణ జరుగకుండా, కేవలం ఒక 149 జీ.వో. తో ఎస్టీ హోదా పొంది, అప్పనంగా ఆదివాసీల హక్కులను అనుభవిస్తున్నారని, దీనితో ఆదివాసీలు మరింత అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.


ఎస్సీ మర్రిగూడెంలో కొందరు లంబాడీలు ఇళ్లు, భూములు కొనుగోలు చేసినట్టు తెలిపారు. మైదాన ప్రాంతానికి చెందిన లంబాడీలు ఏజెన్సీలో గిరిజనేతరులతో సమానమని చెబుతూ, వారికి పంచాయతీ అధికారులు ఇంటి పన్నులు ఇవ్వడంపైన ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్లు వెనక్కి తీసుకోవాలి**

ఏజెన్సీలో లంబాడీలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. మండల పరిషత్ అధికారి లంబాడీ మహిళ పేరుతో ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన ఉప ప్రణాళిక నిధులతో ఏజెన్సీలో వలస గిరిజనేతరులకు, వలస లంబాడీలకు ఇళ్లు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు.

రాజకీయ ప్రయోజనాల కోసం, స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కొందరు రాజకీయ నాయకులు ప్రజలను మభ్యపెట్టడంపైన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. బర్లగూడెం గ్రామపంచాయతీకి మొదటి విడతలో మూడు ఇళ్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. పెసా చట్టం ప్రకారం షెడ్యూల్ ఏరియాలో ఓటు కోసం ఆదివాసీలను ప్రలోభ పెట్టడం, బలవంతం చేయడం చేస్తే అట్రాసిటీ కేసులు పెట్టే పరిస్థితి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఎన్నికల పేరుతో ఆదివాసీ గూడెల్లో చిచ్చు పెట్టాలని చూస్తే వారికి సరైన బుద్ధి చెప్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్ కె ఎస్ సన్నిధి పేదల పెన్నిధి

**చర్ల,అక్టోబర్ 01 (డిడి 9 వార్త)**

చర్ల మండల కేంద్రంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో ఈరోజు ఎస్ కే ఎస్ చారిటబుల్ ట్రస్ట్ వారు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు ప్రధానం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పై మంది ప్రతిభ కలిగినటువంటి పదవ తరగతి పేద విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినటువంటి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు (ప్రథమ బహుమతి రూ. 3500 ), (ద్వితీయ బహుమతి రూ.3000),( తృతీయ బహుమతి రూ. 2500) ప్రోత్సాహక నగదు బహుమతులను ఎస్ కే ఎస్ చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేసారు. ఏజెన్సీ ప్రాంతమైనటువంటి చర్ల మండలం నుండి ఎంబిబిఎస్ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్నటువంటి పది మంది వైద్య ( మెడికల్) విద్యార్థులకు పదివేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేసారు.ఆ తరువాత చర్ల మండలం లో విద్యుత్ శాఖ లో పనిచేసే ముప్పై మంది విద్యుత్ ఉద్యోగులకు జ్ఞాపికలను అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. చర్ల మండలానికి చెందిన గాలి రామ్మోహన్ రావు గారు(70) ప్రముఖ అథ్లెట్ డెబ్బై సంవత్సరాల వయసులో కూడా నేపాల్ లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని పసిడి పథకాన్ని సాధించి, మన దేశానికీ, మన ప్రాంతానికి గొప్ప కీర్తిని తెచ్చిపెట్టినటువంటి ఆయనను ఎస్కేఎస్ చారిటబుల్ ట్రస్టు వారు ఘనంగా సత్కరించారు. అనంతరం చర్ల మండలంలోని కవులు, కళాకారులు చింతూరు వెంకట్రావు, ఎర్రంకి రామారావు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన చింతల వేణు, సామాజిక వేత్త లయన్ నీలి ప్రకాష్ లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఓ పరిటాల రమణ, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, చర్ల మండల పుర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్ కే ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎస్.కె షాజహాన్ ను పలువురు అభినందించారు.



# పరామర్శించిన బిఆర్ఎస్ నాయ కులు

**మంగపేట, అక్టోబర్ 01డీడీ9 వార్త**

మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన కర్రీ నాగేంద్ర తండ్రి కర్రీ నర్సయ్య మృతి చెందాగా బుధవారం జరిగిన దశదినకర్మలకు హాజరై నివాళుల ర్పించిన బిఆర్ఎస్ నాయకులు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తోట రమేష్, జిల్లా నాయకులు తాటి కృష్ణయ్య,కర్రీ శ్యాంబాబు,చిట్టిమల్ల సమ్మయ్య,అల్లే జనార్ధన్,కర్రి శ్రీను ఎస్డి హుస్సేన్,బి య్యని శీను,నిమ్మ గడ్డ ప్రవీణ్,మర్రెడ్డి సుధాకర్ రెడ్డి,మం చాల నరేందర్, సామెలు,చిన్న పుల్లయ్య,కేశవరావు,పాల్గొన్నారు.



# ఆదివాసీల హక్కులు కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలి

- **వలస ఆదివాసీల సాగు భూముల జోలికి రావొద్దు: సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**

**చర్ల, అక్టోబర్ 01 (డిడి9 వార్త):**



ఆదివాసీల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం నాడు తిమ్మిరిగూడెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో ఎక్కడ నివసించినా ఆదివాసులు ఆదివాసులే అవుతారు అని ఆయన స్పష్టం చేశారు. అయితే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వలస ఆదివాసులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, సౌకర్యాలను కల్పించకుండా అడ్డుకుంటున్నాయని మచ్చ వెంకటేశ్వర్లు విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసం తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అడవుల్లో ఉన్న సహజ సంపదకు రక్షకులుగా ఉన్న ఆదివాసీలను అడవికి దూరం చేసి, సహజ సంపదను దోపిడీ చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా, వలస ఆదివాసులకు ఎస్టీ సర్టిఫికెట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వలస ఆదివాసుల, స్థానిక ఆదివాసుల సాగు భూముల జోలికి రావొద్దని ఫారెస్ట్ అధికారులను, ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. ఆదివాసీలకు సీపీఎం ఎల్లప్పుడూ అండగా ఉండి పోరాడుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, శ్యామల చంద్రం, ఇరప ముత్తయ్య, మడకం రాజు, జోగయ్య, రవి, బన్నీ తదితరులు పాల్గొన్నారు.